క్లుప్తంగా

గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన



పుస్తక ప్రదర్శనను తిలకిస్తున్న స్థానికులు, పాఠకులు

గోపాలపట్నం: గోపాలపట్నం శాఖా గ్రంథాలయంలో సోమవారం నిర్వహించిన పుస్తక ప్రదర్శన ఆకట్టుకుంది. జాతీయ అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా ఈ ప్రదర్శన ఏర్పాటు చేసినట్టు గ్రంథాలయాధికారి ఎస్వీ నరసింహం తెలిపారు. అక్షరాస్యత ఆవశ్యకతను విద్యావంతులు ప్రజలకు వివరించాలని కోరారు. కార్యక్రమంలో గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు.

అధ్యాపకుడు రాజుకు సత్కారం



రాజుకు జ్ఞాపిక ఇస్తున్న సెయింట్ ఆన్స్ కళాశాల యాజమాన్యం

మల్కాపురం: మల్కాపురం సెయింట్ ఆన్స్ మహిళా కళాశాల అర్థశాస్త్రం అధ్యాపకుడు బి.పి.రాజును కళాశాల యాజమాన్యం, విద్యార్థులు సోమవారం ఘనంగా సత్కరించారు. కళాశాలలో 17 ఏళ్ల పాటు రాజు బోధించారు. ఇటీవల వెలువడిన డీఎస్సీ ఫలితాల్లో స్కూల్ అసిస్టెంట్‌గా రాజు ఎంపికయ్యారు. దీంతో ఉద్యోగానికి రాజీనామా చేశారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్య ప్రతినిధులు సత్కరించి,జ్ఞాపిక ఇచ్చారు. భవిష్యత్తులో ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి

మల్కాపురం: పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు తగు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ విప్ పి.గణబాబు కంపెనీల యాజమాన్యాలకు సూచించారు. ఈస్ట్ ఇండియా పెట్రోల్ కంపెనీలో ఆదివారం మధ్యాహ్నం జరిగిన ప్రమాదం నేపథ్యంలో, సోమవారం తన నివాసం వద్ద నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈస్ట్ ఇండియా పెట్రోలియం కంపెనీలో జరిగిన ప్రమాదం ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ నివేదిక ద్వారా తెలిసిందన్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన చర్యలను తీసుకుందని వివరించారు. ప్రజలకు ఎటువంటి ప్రమాదం జరగకుండా జాగ్రత్తలు తీసుకునే విధంగా డిజాస్టర్ రెస్పాన్స్ ప్రణాళికలను అమలు చేయాలని సూచించారు.

అప్రెంటిస్‌షిప్ మేళాకు విశేష స్పందన

కంచరపాలెం: పారిశ్రామిక శిక్షణ సంస్థ(ఐటీఐ)లో కోర్సులు పూర్తి చేసి అప్రెంటిస్ చేయని అభ్యర్థులు కోసం విశాఖ ప్రభుత్వ పాత ఐటీఐ కళాశాల ఆవరణలో సోమవారం నిర్వహించిన ప్రధాన మంత్రి నేషనల్ అప్రెంటిస్‌షిప్ మేళా–2025కు విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా కన్వీనర్ జె.శ్రీకాంత్, జోన్–1 ఉప సంచాలకుడు ఆర్ వి.రమణ మాట్లాడుతూ ఈస్ట్ కోస్ట్ రైల్వే, హిందుస్తాన్ షిప్‌యార్డ్, ఆలిండియా రేడియో, మేధా సర్వో డ్రైవ్స్, జయభేరి లిమిటెడ్ మొదలగు ప్రభుత్వ, ప్రైవేటు కంపెనీలు మేళా నిర్వహించగా.. వివిధ ట్రేడ్‌లకు చెందిన 510 మంది అభ్యర్థులు హాజరు కాగా.. 348 మంది ఎంపికైనట్లు తెలిపారు. ప్రిన్స్‌పాల్ డి.వెంకటేశ్వరరావు, అప్రెంటిస్ అడ్వైజర్ మూర్తి, ట్రైనింగ్ అధికారి హెచ్‌వీఎస్ శ్రీనివాస్, ఐటీఐ సిబ్బంది, పలు కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

వాన.. హైరానా



గోపాలపట్నం సప్తగిరి జంక్షన్ వద్ద రోడ్డుపై చేరిన మురుగు నీరు



గోపాలపట్నం నరసింహనగర్ వద్ద నిలిచిన మురుగు నీరు

- లక్ష్మీనగర్ ఎఫ్ బ్లాక్‌లో జారిపడిన బండరాయి
- కూలిన హెచ్‌సీ వెంకటాపురం హైస్కూల్ ప్రహరీ
- తప్పిన ప్రమాదాలు
- హడలిపోతున్న స్థానికులు



లక్ష్మీనగర్ ఎఫ్ బ్లాక్‌లో జారిపడిన బండరాయి, స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ రమణ

జారి పడ్డ బండరాయి...

లక్ష్మీనగర్ ఎఫ్ బ్లాక్ కొండవాలు ప్రాంతంలో బండరాయి జారి పడింది. అదృష్టవశాత్తు ఇళ్లపై పడకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. బండరాయి దాటికి ఎగువ నిర్మించిన దేవస్థానం ప్రహరీ గోడ కూలి కిందకి వచ్చి పడిందని స్థానికులు చెబుతున్నారు. 90వ వార్డు కార్పొరేటర్ రమణ పర్యటించి ప్రజలకు భరోసానిచ్చారు.

గోపాలపట్నం: గోపాలపట్నం, ఎన్ఏడీ పరిసర ప్రాంతాల్లో సోమవారం కురిసిన వర్షం ప్రజలను ఇబ్బందులకు గురి చేసింది. దీని వల్ల రెండు చోట్ల ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. రహదారులపై మురుగు నీరు నిలిచి పోవడంతో వాహన చోదకులు నానా అవస్థలు పడ్డారు. గోపాలపట్నం సీఎంఆర్ షాపింగ్‌మాల్ ఎదురుగా నరసింహనగర్ వద్ద మురుగు నీరు నిలిచిపోయింది.అలాగే సప్తగిరి పెట్రోల్ బంక్ జంక్షన్ వద్ద ఎగువ నుంచి వచ్చిన మురుగు నీరు నిలిచిపోవడంతో ఇక్కడి వారు ఇబ్బందులకు గురవుతున్నారు. దుర్వాసనతో దారుణంగా ఉందని ఇక్కడి వారు వాపోతున్నారు.

కూలిన పాఠశాల ప్రహరీ

జీవీఎంసీ 92వ వార్డు హెచ్‌సీ వెంకటాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రహరీ కూలిపోయింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదమే తప్పినట్లయింది. కొండవాలు ప్రాంతంలో నుంచి వచ్చిన వర్షపు నీరు రావడంతో కోరుకు పోయి ప్రహరీ కూలిపోయిందని స్థానికులు, ఉపాధ్యాయులు చెబుతున్నారు. గతంలో కూడా ఇదే ప్రాంతంలో ప్రహరీ కూలిపోయింది. గోడ కూలిన చోట ఓపెన్ జిమ్ పరికరాలు ఉన్నాయి. పిల్లలు ఆడుకునే సమయంలో జరిగితే ప్రాణ నష్టం చోటు చేసుకునేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గోడ శిథిలాలు చెల్లాచెదురుగా పడ్డాయి. ఇవి తగిలినా గాయాల పాలయ్యేవారని వాపోతున్నారు. ఎగువ నుంచి వచ్చేవర్షపు నీరు వెళ్లేందుకు కాల్వలు ఏర్పాటు చేయాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.



హెచ్‌సీ వెంకటాపురం హైస్కూల్‌లో కూలిన ప్రహరీ

కూటమి నాయకుల చేతిలో పట్టాలు



తహసీల్దార్ కార్యాలయం వద్ద వైఎస్సార్‌సీపీ నాయకులు

- లబ్ధిదారుల నుంచి బలవంతంగా తీసుకుంటున్న వైనం
- తహసీల్దార్‌కు వైఎస్సార్‌సీపీ నాయకుల వినతి

మల్కాపురం: పేదలకు జీవో నంబర్ 296 ప్రకారం ప్రభుత్వం ఇచ్చిన పట్టాలను స్థానిక కూటమి నాయకులు బలవంతంగా తీసుకోవడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. దీంతో లబ్ధిదారులకు న్యాయం చేయాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ నాయకులు తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. జీవో 296 ప్రకారం ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూములను క్రమబద్ధీకరిస్తూ, 59వ వార్డు పరిధిలోని పలువురు లబ్ధిదారులకు ములగాడ తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది పట్టాలను పంపిణీ చేశారు. అయితే, స్థానికంగా ఉన్న కొందరు కూటమి నాయకులు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి, ఆ పట్టాలను తీసుకుంటున్నారు. ఇదేమని ప్రశ్నిస్తే సమావేశంలో ఎమ్మెల్యేతో ఇప్పిస్తామని చెబుతున్నారు. పట్టా ఇచ్చి, మరలా తీసుకోవడమేంటని ప్రశ్నించినా వారు పట్టించుకోవడం లేదని, ఇవ్వకపోతే మీకే నష్టమని బెదిరిస్తున్నారని సమాచారం. దీంతో చేసేది లేక పలువురు లబ్ధిదారులు వారికి పట్టాలు ఇచ్చారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు రేవళ్ల సత్యనారాయణ స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలిసి సోమవారం ఉదయం ములగాడ తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లారు. తహసీల్దార్ రమేష్‌కు సమస్యను వివరించి, వినతిపత్రం అందించారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ పట్టా రిజిస్ట్రేషన్ పూర్తి చేసి అందిస్తామన్నారు. పట్టాల కోసం ఎవరైనా దళారులు డబ్బులు వసూలు చేస్తే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. వినతిపత్రం అందించిన వారిలో పార్టీ నాయకులు ఎదుర సత్యనారాయణ, భూపతినాయుడు, సత్యనారాయణ, బుల్లబ్బాయి తదితరులున్నారు.

ఆలయాలకు భక్తుల తాకిడి



శివలింగానికి అభిషేకం చేస్తున్న అర్చకుడు



దేవుని సామగ్రి శుభ్రపరుస్తున్న భక్తుడు

మల్కాపురం: చంద్ర గ్రహణం కారణంగా ఆదివారం మధ్యాహ్నం మూతపడిన పారిశ్రామిక ప్రాంతంలోని ఆలయాల్లో సోమవారం అర్చకులు సంప్రోక్షణ చేసి ప్రత్యేక పూజలు చేశారు. ఐవోసీ చింతా మణి దుర్గాగణపతి ఆలయం, ప్రకాష్‌నగర్, శ్రీహరిపురం తదితర ప్రాంతాల్లోని ఆలయాలను సోమవారం వేకువజామునే పరిశుభ్రం చేశారు. అనంతరం కొలువుదీరిన గణనాథులు,శివునికి,వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు జరిపించారు. గ్రహణం కారణంగా దోషాల నుంచి విముక్తి పొందేందుకు ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులకు దానాలు ఇచ్చారు. సోమవారం కావడంతో శివాలయాలకు భక్తులు పోటెత్తారు.

ప్రొటోకాల్‌కు తిలోదకాలు!

అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు



గౌరీనగర్‌లో నూతనంగా నిర్మించిన వార్డు కార్యాలయం భవనం

గోపాలపట్నం: ఏ వార్డులో అభివృద్ధి పనులు చేసినా ఆ వార్డు కార్పొరేటర్ నుంచి ఎమ్మెల్యే ఎంపీ, మంత్రి, కలెక్టర్, కమిషనర్ ఇలా పలువురి పేర్లతో శిలాఫలకం ఏర్పాటు చేస్తారు. ఇక్కడ మాత్రం ఏ ప్రొటోకాల్ పాటించలేదు. పశ్చిమ నియోజకవర్గంలో ఎమ్మెల్యే గణబాబు ఒక్కరికే చోటు కల్పించడం ఇప్పుడు చర్చకు తెరలేసింది. అధికారులకు అసలు ప్రొటోకాల్ తెలియదా అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

ఇదీ విషయం

జీవీఎంసీ 52వ వార్డు గౌరీనగర్‌లో పాత వార్డు కార్యాలయాన్ని తొలగించి రూ.38 లక్షలతో కొత్తది నిర్మించారు. ఈ నిర్మాణ పనులకు అప్పటి డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ శంకుస్థాపన చేశారు. ప్రొటోకాల్ ప్రకారం శిలాఫలకంపై ఎమ్మెల్యే పేరుతో సహా అందరి పేర్లు రాయించారు. ఇపుడు ఆ శిలాఫలకం ఏమైందో కనిపించడం లేదు. కాగా దిగువ కార్యాలయంలో శానిటరీ విభాగానికి, మలేరియా విభాగాలు, పై అంతస్తులో సచివాలయం ఏర్పాటుకు నిర్ణయించారు. అయితే ఇటీవల ఈ భవనంలో విజన్ యాక్షన్ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇక్కడ శిలాఫలకాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో కనీసం సాంప్రదాయం పాటించకపోవడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. స్థానిక కార్పొరేటర్ పేరు, ఇతర ప్రజా ప్రతినిధుల పేర్లువేయకుండా కేవలం ఎమ్మెల్యే పేరు వేశారు. ఇప్పటికైనా అధికారులు తప్పును సరిదిద్దుకుని పాత శిలాఫలకాన్ని ఏర్పాటు చేయాలని, విజన్ యాక్షన్ కార్యాలయం శిలాఫలకంపై ప్రొటోకాల్ ప్రకారం పేర్లు రాయించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.



కేవలం ఎమ్మెల్యే పేరుతో వేసిన శిలాఫలకం

డిఫెన్స్ మద్యంతో వ్యక్తి అరెస్ట్



ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్న డిఫెన్స్ మద్యం

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు ఇందిరాకాలనీ ప్రాంతానికి చెందిన శరగడం దుర్గాప్రసాద్ అనే వ్యక్తి డిఫెన్స్ మద్యం విక్రయిస్తున్నాడని సమాచారం అందుకున్న గాజువాక ఎక్సైజ్ పోలీసులు సోమవారం ఉదయం జింక్ గేటు వద్ద మాటు వేశారు. ఆ సమయంలో దుర్గాప్రసాద్ సుమారు 46 ఫుల్ బాటిళ్లు తరలిస్తుండగా పట్టుకున్నారు. మద్యం బోటళ్లతో పాటు అతన్ని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. దాడుల్లో ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ కె.నరసింహమూర్తి,రామకృష్ణ ఇతర సిబ్బంది ఉన్నారు.

జోన్-5కు రెండే వినతులు

కంచరపాలెం: జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోన్–5 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' కార్యక్రమానికి రెండు వినతులు అందాయి. అర్జీదారుల నుంచి వాటిని జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము స్వీకరించి పరిశీలించారు. ఈ సందర్భంగా జెడ్సీ మాట్లాడుతూ టౌన్ ప్లానింగ్ విభాగానికి 01, రెవెన్యూ విభాగానికి 01 చొప్పున వినతులు అందినట్లు తెలిపారు. పీజీఆర్ఎస్‌కు అందిన అర్జీలను తక్షణం పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఆర్వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, ఇంజినీరింగ్ ఈఈలు తారా ప్రసన్నరెడ్డి, పద్మావతి, డీఈ భరణికుమార్, విద్యుత్ లైట్ల ఏఈ అర్చన, వాటర్ ఏఈ సుమన్, టౌన్ ప్లానింగ్ ఏసీపీ తిరుపతిరావు, ఏపీడీవో కృపానందం, పి.పుణ్యవతి, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.



జోన్-5 కార్యాలయంలో అర్జీలు స్వీకరిస్తున్న జెడ్సీ రాము

రోడ్లు బురదమయం



పోర్టు క్వార్టర్స్ బస్టాప్ వద్ద రోడ్డు ఇలా...



కోస్టుగార్డు నుంచి త్రినాథపురం వెళ్లే సేవా మార్గంలో బురద

పారిశ్రామిక ప్రాంతంలోని పలు సర్వీసు రోడ్లు బుదమయంగా మారాయి. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లపై నీరు ప్రవహించిన విషయం తెలిసిందే. అయితే ఎగువ ప్రాంతాల నుంచి కొట్టుకువచ్చిన మట్టి రోడ్లపై నిలిచిపోయింది. దీంతో పలు మార్గాలు మట్టిరోడ్లను తలపిస్తున్నాయి. వాహన చోదకులు, పాద చారులను అవస్థలకు గురిచేస్తున్నాయి.జారుగా ఉండడంతో వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. మరోవైపు భారీ వాహనాలు వచ్చిన సమయంలో ద్విచక్రవాహనదారులు, పాదచారులు వెళ్తే బురదతో తడిసిపోతున్నారు. రోజుల తరబడి ఇదే పరిస్థితి ఉన్నా అధికారులు స్పందించి రోడ్లపై పేరుకుపోయిన బురద, మట్టితొలగించడం లేదని వాహనచోదకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మల్కాపురం పోర్టుక్వార్టర్స్ బస్టాప్,ఆర్‌కేపురం,కోస్టుగార్డు వంటి ప్రధాన కూడళ్లలో పరిస్థితి మరీ అధ్వానంగా ఉంది.

\- మల్కాపురం



మల్కాపురం మరిడిమాంబ ఆలయం వద్ద బురద మయంగా రోడ్డు

ఉక్కు విషయంలో ఎంపీ, ఎమ్మెల్యే దుష్ప్రచారం

- కార్మికుల పోరాటాలకు అడ్డుపుల్ల
- కూటమి కంటే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే మేలు
- ప్లాంట్ పరిరక్షణ కోరుతూ 11న బహిరంగ సభ
- సీపీఎం నాయకుల వెల్లడి

గాజువాక: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ విషయంలో ఎంపీ శ్రీభరత్, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పూర్తిగా అవాస్తవాలను ప్రచారం చేస్తున్నారని సీపీఎం నాయకులు పేర్కొన్నారు. ప్లాంట్‌ను ప్రైవేటీకరిస్తామని ఒకపక్క మోదీ ప్రభుత్వం పార్లమెంట్ సాక్షిగా చెబుతుంటే ఈ కంపెనీని కాపాడేశామంటూ ఎంపీ, ఎమ్మెల్యే దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. ఈవోఐ పేరుతో విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మకానికి పెట్టారని, దీనికి వ్యతిరేకంగా ఈనెల 11న గాజువాకలో బహిరంగ సభ నిర్వహించనున్నామని తెలిపారు. బహిరంగ సభ పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్ బయట ఆర్ఐఎన్ఎల్ బోర్డు ఉంటుందని, ఈవోఐ పేరుతో ప్లాంట్ లోపల డిపార్ట్‌మెంట్లను ప్రైవేటుపరం చేయనున్నారని అన్నారు. దీనికోసం ఈనెల 9లోగా బిడ్లు వేయాలని ప్రకటనలు ఇచ్చారని, ప్లాంట్‌ను 46 ముక్కలుగా అమ్మాలని నిర్ణయించారని తెలిపారు. ఈ ప్రక్రియ సజావుగా సాగిపోతే తరువాత దశలో మొత్తం ప్లాంట్‌ను తమ అనుకూల పారిశ్రామికవేత్తలకు కట్టబెట్టాలనే కుట్ర జరుగుతోందన్నారు. ప్లాంట్‌ను వారు కాపాడిందే నిజమైతే ప్రైవేటీకరించడం లేదని కేంద్ర ప్రభుత్వంతో ప్రకటన చేయించాలని డిమాండ్ చేశారు. ప్లాంట్ పరిరక్షణకు, ఉద్యమాల విషయంలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే కార్మికులకు ఎంతోకొంత అనుకూలంగా నడిచిందన్నారు. సీఐటీయూ జాతీయ నాయకుడు ఎస్.రామారావు మాట్లాడుతూ 11న గాజువాకలో నిర్వహించనున్న బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. స్టీల్‌ప్లాంట్ చరిత్రలో ఏ ప్రభుత్వం చేయని విధంగా కూటమి ప్రభుత్వం రాష్ట్ర పోలీసులను ప్లాంట్ లోపల విభాగాల్లోకి పంపించి కార్మికులను తీవ్రంగా బెదిరించిందన్నారు. నాయకులకు షోకాజ్ నోటీసులిచ్చారని, సస్పెండ్ చేశారని, అరెస్టు కూడా చేశారని పేర్కొన్నారు. సీపీఎం నాయకులు ఎం.రాంబాబు, గొలగాని అప్పారావు, బంగారు నాయుడు, ఎ.లోకేష్ పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

ఫెర్రోస్క్రాప్ ఉద్యోగులకు బోనస్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లోని ఫెర్రోస్క్రాప్ ఉద్యోగులకు యాజమాన్యం బోనస్ చెల్లించనుందని ఫెర్రోస్క్రాప్ ఎంప్లాయీస్ యూనియన్ గౌరవాధ్యక్షుడు మంత్రి రాజశేఖర్ తెలిపారు. సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల బోనస్ తదితర అంశాలపై ఇటీవల ఒప్పందం జరిగిందన్నారు. ఒక్కో ఉద్యోగికి రూ.23 వేల బోనస్‌తో పాటు మెడికల్ ఇన్సూరెన్స్‌తో పాటు నేషనల్ పెన్షన్ స్కీం (ఎన్‌పీఎస్) అమలు చేస్తారని చెప్పారు. కార్మికులకు నైట్ షిఫ్ట్ అలవెన్స్ రోజుకు రూ.150 చెల్లిస్తారన్నారు. కార్మికులకు అత్యవసర వైద్యం కిమ్స్‌లో అందజేయనున్నారన్నారు. సమావేశంలో యూనియన్ అధ్యక్షుడు ప్రసాద్, ప్రధానకార్యదర్శి ఎం. అమ్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.